# తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- శేరిలింగంపల్లి, కొండాపూర్ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సెంట్రల్ ఫేజ్ -1లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ, పాల్గొన్న కార్పొరేటర్ నాగేందర్ యాదవ్



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ, పాల్గొన్న కార్పొరేటర్ శ్రీకాంత్

కొండాపూర్/ మియాపూర్, సెప్టెంబర్ 30 : తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శనివారం శేరిలింగంపల్లి డివిజన్ సెంట్రల్ పార్కు ఫేజ్-1లో రూ. 45 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ పనులు, రూ. 17లక్షలతో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం విప్ గాంధీ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు తాగునీరు, మురుగునీటి ఇబ్బందులకు గురవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పైపులైన్ల నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. జనాభా ప్రాతిపాదికన పెద్ద పరిమాణంలో పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ జీఎం రాజశేఖర్, మేనేజర్ విక్రమ్‌రెడ్డి, సత్యనారాయణ, గోపాల్‌యాదవ్, సెంట్రల్ పార్కు కాలనీవాసులు, అలిండ్ సొసైటీ వాసులు పాల్గొన్నారు.

### కొండాపూర్‌లో రూ. 45లక్షలతో...

కొండాపూర్ డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ. 45లక్షలతో గోపాల్‌రెడ్డినగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం విప్ గాంధీ మాట్లాడుతూ.. రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. బస్తీలు, కాలనీలలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జలమండలి జీఎం రాజశేఖర్, మేనేజర్ సందీప్, నాయకులు గణేశ్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, క్రిష్ణ, జంగంగౌడ్, ప్రసాద్, తిరుపతి, రజనీకాంత్,రవిశంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

కాలనీవాసులకు సౌకర్యవంతంగా ఉండేలా కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు విప్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులను ఇందుకోసం వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ లక్ష్మీనగర్‌లో సీడీపీ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి సమావేశాలు, సభలు, వేడుకలను నిర్వహించుకునేలా కమ్యూనిటీ హాళ్లను అందుబాటులోకి తెస్తామన్నారు. లక్షలాది నిధులతో ఇప్పటికే మల్టి పర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలను పూర్తి చేశామని, త్వరలో వాటిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ సమాగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తోడ్పాటుతో అధిక నిధులను సమకూర్చుకుంటూ పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గణేశ్, కిరణ్, గంగాధర్, ప్రవీణ్, ప్రసాద్, చంద్రిక, వరలక్ష్మి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడికి ప్రభుత్వ విప్ పూజలు



ఆల్విన్ కాలనీ డివిజన్ విజయనగర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

– మియాపూర్, సెప్టెంబరు 30

## నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా



జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

కొండాపూర్, సెప్టెంబర్ 30 : తెలుగు సాహిత్యానికి, సామాజిక అభ్యుదయం కోసం కవి గుర్రం జాషువా ఎంతో కృషి చేశారని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం బహుజన్ స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్‌ఎఫ్ – హెచ్‌సీయూ) ఆధ్వర్యంలో కవి కోకిల గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని, ఆయన సామాజిక అభ్యుదయ సాధనకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య బాణాల భుజంగరెడ్డి, సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పీ. రవీందర్, మానస ఎండ్లూరి, డాక్టర్ భారతి, రోహిత్, బీఎస్‌ఎఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న నృత్య కళాకారులు

కొండాపూర్, సెప్టెంబర్ 30 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గుజరాత్ ఉత్సవ్ మేళా సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. గుజరాత్‌కు చెందిన పలువురు చేనేత హస్తకళాకారుల ఉత్పత్తులు నాణ్యతతో పాటు అందుబాటు ధరలకు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మేళాకు వచ్చిన సందర్శకులను మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు ఆంఫీ థియేటర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రదర్శనల్లో భాగంగా శనివారం తేజస్వి కొండూరి భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గుజరాతి రసగర్భ నృత్యాలు, రాధా మోహన్ తన శిష్య బృందంతో కలిసి రాధా మోహనం శ్రీకృష్ణుడి బాల్య లీల, యుక్తవయసు రాధా గోపికలతో రాసలీలలు, రాధాకృష్ణుల ప్రేమామృత విలువలను భరతనాట్య రూపకంలో ప్రదర్శించారు.



ప్రదర్శనతో ఆకట్టుకున్న కళాకారులు

# ఆరోగ్యమే.. ఐశ్వర్యం

- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- కూకట్‌పల్లిలో 5కే వాకథాన్ ప్రారంభం
- వ్యసనాలకు బానిస కావొద్దని పిలుపు





5కే వాకథాన్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి, పాల్గొన్న యువతీయువకులు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 30 : ఆరోగ్యమే మహాభాగ్యమని.. ఐశ్వర్యమని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించడానికి ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం 'వరల్డ్ హార్ట్ డే' సందర్భంగా మల్లారెడ్డి నారాయణ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రంగధాముని చెరువు పక్కన అశోకవన్ మాల్ నుంచి సూరారం వరకు నిర్వహించిన '5కే వాకథాన్'ను మంత్రి మల్లారెడ్డి వైద్యశాల చైర్మన్ చామకూర భద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్యానికి మించిన భాగ్యం లేదని.. ఆరోగ్యవంతులుగా జీవించడానికి చెడు ఆహారపు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. 70 ఏండ్ల వయసులో తాను ఆరోగ్యంగా ఉండడానికి తాను రోజూ యోగా సాధన, 25 నిమిషాల వ్యాయామం చేస్తానన్నారు. నేటితరం యువత తంబాకు, గంజాయి, గుట్కా లాంటి చెడు వ్యసనాలకు బానిసలై అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత వ్యసనాలకు బానిసలు కావొద్దని పిలుపునిచ్చారు. ఇంజినీర్లు, డాక్టర్లు, ఐటీ ఉద్యోగులతో పాటు పలువురు రోజంతా సీట్లలో కూర్చుని పనిచేయడం, ఒత్తిడి కారణంగా గుండె జబ్బుల బారిన పడుతున్నారనిన్నారు. కరోనా తర్వాత అనారోగ్య సమస్యలు పెరిగాయని.. 30 ఏండ్లకే గుండె జబ్బులు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో గంట సమయాన్ని ఆరోగ్యానికి కేటాయించాలని సూచించారు. అలాగే నగరంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రజల ఆరోగ్యం కోసం వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, ఆహ్లాదకరమైన పార్కులను అందుబాటులోకి తెచ్చారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు సుధాకర్, ఆనంద్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

### పాలమ్మిన.. పూలమ్మిన..

5కే రన్ వాక్‌థాన్‌లో మంత్రి మల్లారెడ్డి డీజే పాటలకు స్టెప్పులేస్తూ తనదైన శైలిలో డైలాగులు చెబుతూ యువతలో జోష్ నింపారు. పాలమ్మిన.. పూలమ్మినా అంటూ తన డైలాగులతో పాటు టిల్లూ అన్న డీజే పెడితే తిల్లాతిల్లా ఆడాలా.. పాటకు స్టెప్పులేస్తూ సందడి చేశారు. యువకులతో ఏమాత్రం తీసిపోని విధంగా స్టెప్పులేసి ఆటపాటలతో మంత్రి సందడి చేశారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల సందర్శనకు జేఎన్‌టీయూ కాంట్రాక్టు అధ్యాపకులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ, యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు శనివారం సీఎం కేసీఆర్ చేపట్టిన 'పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు' సందర్శనకు బయల్దేరి వెళ్లారు. బస్సు యాత్రను జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, మెకానికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి రాజేశ్‌ఖన్నా, డాక్టర్ కే శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ దశరథం, తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు అధ్యాపకుల బస్సు యాత్రను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి